
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024



25న అంగన్‌వాడీల ధర్నా



ప్రజాశక్తి-సూళ్లూరుపేట

అంగన్వాడీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 25వ తేదీన కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు హైమావతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఐసిడిఎస్ ను బలోపేతం చేసేందుకు సిఐటియు ఆధ్వర్యంలో కషి చేస్తున్నామని ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఈ క్రమంలోనే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పుచేసి మెయిన్ వర్కర్లకు ఇచ్చే వేతనాలను మినీ వర్కర్లకు ఇవ్వాలని డిమాండ్ చేస్తామన్నారు. అంగన్వాడి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో ఆక్వారంగాన్ని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేస్తామని, ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు జిల్లా మత్స్య శాఖ వారు నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవం కార్యక్రమంలో పలు మత్స్యకార సంఘాల నాయకులు, ఆక్వా సాగు రైతులు, హ్యాచరీ ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా మత్స్యకారులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మత్స్యకార భరోసా పథకం అమలుచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. మత్స్యశాఖ కమిషనర్ విజయవాడ ఆధ్వర్యంలో బోట్ల గణన జరిగిందన్నారు. జిల్లాలో 880 బోట్లు, 4203 మంది సిబ్బంది ఉన్నారన్నారు. ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్ రాష్ట్ర పండుగగా అటవీ, పర్యాటక, మత్స్య శాఖల సమన్వయంతో ఘనంగా సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల మధ్యన పులికాట్ సరస్సులో చేపల వేటపై మత్స్యకారుల మధ్య తలెత్తిన వివాదంపై కలెక్టర్‌గా పక్క రాష్ట్రంలోని కలెక్టర్, ఎస్‌పితో మాట్లాడానన్నారు. శాశ్వత పరిష్కారానికి త్వరలోనే దృష్టి పెడతామన్నారు. తడ, సూళ్లూరుపేట ప్రాంతాలలో ఆక్వా, మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆక్వా, మత్స్యకార సాగు రైతులను సన్మానించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, జిల్లా అధ్యక్షులు మత్స్యకార సహకార సంఘం జివిరత్నం, పులికాట్ సరస్సు మత్స్యకారుల సంఘం బొమ్మన శ్రీధర్, హేచరీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాగర్ రెడ్డి పాల్గొన్నారు.




ప్రపంచ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని సమీక్షా సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుమలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం : టీటీడీ ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుమలను పక్కా ప్రణాళికతో మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని టీటీడీ ఈవో జే. శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని పరిపాలన భవనంలోని మీటింగ్ హాల్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ ధార్మిక కేంద్రమైన తిరుమలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా డిజైన్లు రూపొందించాలన్నారు. ఇందుకోసం విజన్ డాక్యుమెంట్ తక్షణావసరం అని, టీటీడీకి అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ టౌన్ ప్లానింగ్ వింగ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తిరుమలలో పాదచారులకు అనుకూలంగా ఫుట్‌పాత్‌లను మార్చడంతో పాటు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు అవసరమైన నిర్మాణాలు, స్మార్ట్ పార్కింగ్ సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొన్ని పాత కాటేజీలతో పాటు బాలాజీ ఆర్టీసీ బస్టాండ్‌ను కూడా కొత్తగా నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. రాబోయే 25 సంవత్సరాల భవిష్యత్ అవసరాలను దష్టిలో ఉంచుకుని డాక్యుమెంట్ను రూపొందించి దాని ప్రకారం మౌళిక సదుపాయాలు రూపొందించే ఆలోచన ఉందన్నారు. ఇందుకు టౌన్ ప్లానింగ్ లో నిపుణులైన రిటైర్డ్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌ను సలహాదారుగా నియమించామన్నారు. తిరుమలలో మరింతగా ఆధ్యాత్మికత వాతావరణం ఉండేలా ప్రస్తుతం ఉన్న కాటేజీలకు 150 పేర్లు పెట్టి, వాటినే కాటేజీ దాతలు ఎంపిక చేసుకుని పేర్లను మార్చేలా టిటిడి బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. తిరుమలలో మరింతగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా చూడడమే టీటీడీ అంతిమ లక్ష్యం" అని ఆయన తెలిపారు.



పంచమితీర్థానికి విస్తతంగా ఏర్పాట్లు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలను నవంబరు 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు విస్తతంగా ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గురువారం సాయంత్రం ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ గోవింద రాజన్ పాల్గొన్నారు.

'బీర్' లోడ్ లారీ బోల్తా

నోరూరించిన బాటిళ్లు
సేఫ్టీ పోలీసులు అప్రమత్తం



ప్రజాశక్తి - తడ

'బీరు బాటిళ్ల లోడ్'తో వెళుతున్న లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో అట్టపెట్టెల్లో ఉన్న బీరు బాటిళ్లు అన్నీ బయటకు తొంగిచూశాయి.. స్థానికంగా ఈ ప్రమాదాన్ని చూసిన కొందరికి బీర్ బాటిళ్లు కనిపించడంతో నోరూరింది. వాటిని తీసుకునేందుకు ప్రయత్నించారు. అయితే హైవే రోడ్డు సేఫ్టీ పోలీసు సిబ్బంది అప్రమత్తమై బీరు బాటిళ్లు ఎవరూ తీయకుండా చూశారు. ఈ ఘటన తడ మండలం మాంబట్టు సమీపంలోని అప్పాచి ఫ్యాక్టరీకి వెళ్లే రోడ్డులో అక్కంపేట మధ్యలో నేషనల్ హైవే జోడ్ చెరువు వద్ద గురువారం ఉదయం 7.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. బీరు బాటిళ్ల లారీ పుదిచ్చేరి నుంచి వైజాగ్‌కు వెళుతోంది. అక్కంపేట దాటగానే డ్రైవర్ కె.సేతు (37) నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ అదుపు తప్పి చెరువులో బోల్తా పడిందని పోలీసులు తెలిపారు. లారీలోని బీరు బాటిళ్ల విలువ దాదాపు పది లక్షలుపైనే ఉంటుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ సేతుకు గాయాలు కావడంతో సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.

రాత్రి బస కేంద్రం పరిశీలన


ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని పట్నూల్ వీధిలో గల రాత్రి బస కేంద్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం రాత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. మౌలిక వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పలువురిని పలకరించి ఎక్కడ నుండి వచ్చారు, వసతి కేంద్రంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రంలో బస చేస్తున్న వారికి అందించే భోజనాన్ని కమిషనర్ రుచి చూసి సంతప్తి వ్యక్తం చేశారు. అలాగే మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మంచాలు, బెడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇక్కడ బస చేస్తున్న వారికి ఎటువంటి జబ్బులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, మెప్మా సి.ఎం.ఎం. కష్ణవేణి, హెరీప్ సంస్థ ప్రతినిధి కవిత ఉన్నారు.



పార్కులను పరిశుభ్రంగా ఉంచండి

తిరుపతి నగరంలో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తున్న పార్కుల్లో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని వినాయక సాగర్ లో పారిశుద్ధ్య పనులను, తాగునీటి సాంద్రత పరీక్షలను గురువారం ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి తనిఖీ చేశారు. వినాయకసాగర్‌లో నీటిపై పేరుకుపోయిన చెత్తను ప్రతిరోజూ తొలగించాలన్నారు. వాకర్స్ తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.



రాజీవ్ నగర్ అక్రమాలను వెలికితీస్తాం : తహాశీల్దార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలన్నింటినీ వెలికితీస్తామని తహాశీల్దారు లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలనీలో చోటు చేసుకున్న అక్రమాలపై సెప్టెంబర్ నెలలో 54 బందాలుగా ఏర్పడి సమగ్ర సర్వే చేశామన్నారు. 6300 ఇళ్ల స్థలాలకు గాను, 2వేల మందికి పైగా పట్టాలు పొందినట్లు గుర్తించామని తెలిపారు. అయితే లబ్ధిదారుల ఆచూకీ లభించలేదన్నారు. ప్రభుత్వం ద్వారా ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ అభ్యంతరాలను ఈనెల 30వ తేదీలోగా తహాశీల్దార్ కార్యాలయంలో తెలిపాలని కోరారు.

నేతమ్స్ షుగర్ రైతులకు న్యాయం చెయ్యండి : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

నేతమ్స్ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు చెల్లించి న్యాయం చేయాలని నగరి ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో తన గళాన్ని వినిపించారు. నగరి నియోజకవర్గం నింద్ర నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులు , ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావించారు. నేతమ్స్ ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు సుమారు రు. 37 కోట్లు, ఉద్యోగులకు సుమారు రు. 12 కోట్లు బకాయిలు పెట్టారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలనుండి ఫ్యాక్టరీ మూతబడి చెల్లించాల్సిన బకాయిలను చెల్లించక పోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఫ్యాక్టరీ వేలానికి వచ్చిందని ప్రభుత్వం దష్టికి తెచ్చారు.

3న 'ఐక్యూ 13' ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ 13ను 3వ తేదీ ఆవిష్కరిస్తున్నట్లు ఆ కంపెనీ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.స్మార్ట్ ఫోన్ ఆవిష్కరణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిన ఐక్యూ 13 అధునాతన కెమెరా సామర్థ్యాలు, అద్భుతమైన డిజైన్ పొడిగించిన బ్యాటరీ లైఫ్ ఇమ్మర్సివ్ డిస్ప్లేటెక్నాలజీలతో మెరుపు-వేగవంతమైన పనితీరును మిళితం చేస్తుంది. ఇది వారి స్మార్ట్ఫోన్ల నుండి ఉత్తమ పనితీరు, డిజైన్, కార్యాచరణను ఆశించే వినియోగదారులకు సాటిలేని అనుభవాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

బకాయి పింఛన్ల మంజూరుకు ఉత్తర్వులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ప్రతి మాసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇస్తోంది. ప్రతినెల లబ్ధిదారుడికి మంజూరైన పింఛను ఒకటో నెల తీసుకోకపోతే, రెండవ నెలలో మొదటి నెల పింఛను, రెండు నెలలు పింఛను తీసుకోకపోతే మూడవ నెల మొదటి రెండు నెలల పింఛను తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందని డిఆర్డిఏ పిడి శోభన్ బాబు తెలిపారు. ఈ అరియర్స్ పొందే విధానానికి సంబంధించి సెర్ప్, సీఈవో వీర పాండియన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. మూడు నెలలు క్రమంగా పింఛన్‌దారు పింఛను తీసుకోకపోతే దానిని నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. మళ్లీ ఆ లబ్ధిదారుడికి పింఛన్ మంజూరు జాబితాలో చేర్చాలంటే తదుపరి మూడు నెలల లోపు సంబంధించిన వారికి సచివాలయంలో పింఛన్ కోసం రోల్ బ్యాక్ అవకాశం కల్పించారన్నారు. రోల్ బ్యాక్ జరిగిన తర్వాత పింఛను మంజూరైన నెల నుంచి ఆ నెల పింఛను మాత్రమే పొందుతారని స్పష్టం చేశారు. రోల్ బ్యాక్ అయినవారికి బకాయి పింఛన్లు మంజూరు చేయబడదన్నారు.

రాయలసీమలో నిరుద్యోగ సమస్య : చింతా మోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని, పనులు లేక కూలిపనులకు వెళుతున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వ్యాఖ్యలు చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మందికి ఉపాధి కల్పించాలని దుగరాజపట్నం ఓడరేవును తమ హయాంలో తీసుకొచ్చామన్నారు. టీటీడీలో పనిచేస్తున్న పర్మనెంట్ ఉద్యోగస్తులకు అలిపిరి పరిధిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్విమ్స్‌లో పేదవాడికి, స్థానికులకు ఉచిత వైద్యం ఇవ్వాలన్నారు. కేంద్రంలోని మోదీ, అమిత్ షాలను చూస్తే చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టవద్దని సీఎం చంద్రబాబుకు సూచించారు. తిరుమల లడ్డు వ్యవహారం పై చంద్రబాబు ప్రస్తావించకుండా ఉండాల్సిందన్నారు. కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, తేజోవతి, మునిశోభ, వెంకటేశ్వర్లు, వేణు పాల్గొన్నారు.



రిజర్వాయర్ పనులను వేగవంతం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జిల్లాలోని దీర్ఘకాలంగా పూర్తికాని రిజర్వాయర్ పనులను వేగవంతం చేసేలా ప్రత్యేక దృష్టి చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు బాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు రిజర్వాయర్ పెండింగ్ పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఆ దిశగా అధికారులు ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తిరుపతి, తిరుమల ప్రజలకు తాగునీరు, సాగునీరు సమస్య లేకుండా పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగ ప్రాజెక్టు, జి.ఎన్.ఎస్.ఎస్ ఎస్‌ఈ మదన గోపాల్, తెలుగు గంగ ప్రాజెక్టు ఈఈ (వెంకటగిరి) రాదాకృష్ణ మూర్తి , తిరుపతి మైనర్ ఇరిగేషన్ ఈ ఈ వెంకటేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర ఓ ఎలక్షన్ స్టంట్: రవి నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



'ఆడుదాం ఆంధ్రా' అంతా ఓ ఎలక్షన్ స్టంట్ అని, ఈ పేరు చెప్పుకుని నిధుల పేరుతో దండుకున్నారని, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ లను చదువుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులను విమర్శించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇలానే జగన్ అబద్ధాలు చెబితే వాస్తవాలను బయటపెడతామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ (శాప్) రవి నాయుడు హెచ్చరించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో రవి నాయుడు మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రలో జరిగిన అవినీతి అక్రమాలను విచారణ చేయాలని ఇప్పటికే సిఐడి వారికి లేఖ రాశానన్నారు. పేద క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన నిధులను అప్పటి మంత్రి రోజా అడ్డగోలుగా దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిన్న డబ్బంతా కక్కిస్తామని, తప్పు చేసిన వారు ఎంత వారైనా జైలుకు వెళ్ళక తప్పదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగు యువత నాయకులు కష్ణ యాదవ్, ఆర్పి శ్రీనివాస్, తోట వాసు, కరణం సందీప్ పాల్గొన్నారు.

పాపవినాశనంలో అటవీశాఖ అక్రమాలు : రాధాకృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల పాపవినాశనంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది చేస్తున్న అక్రమాలు అన్ని ఇన్ని కావని, ఏళ్ల తరబడి శ్రీవారి భక్తులనే నమ్ముకుని జీవిస్తున్న షికారీలను, వారితో స్థానికులుగా ఉన్న తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అక్కడి వ్యాపారి రాధాకృష్ణ ఆరోపణలు చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి లక్షల రూపాయలు అటవీశాఖ అధికారులు తీసుకున్నారని ఆరోపించారు. యాత్రికులకు ఎటువంటి స్లిప్పులు ఇవ్వకుండా డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. డిఆర్ఓ స్వప్నకుమారి, ఎఫ్ ఆర్ ఓ సుదర్శన్ రెడ్డి, గార్డ్ మురళి, బేస్ క్యాంపు వాచర్లు వెంకటేష్, బాబు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తిరుమల పాపవినాశనంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను, అక్రమ సంపాదనకు అలవాటు పడిన సిబ్బందిపై సీఎం చంద్రబాబు, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో షికారీలు బాలు, విశ్వనాథ్, రాజా, మధుర మన్యం పాల్గొన్నారు.



ఘనంగా రాష్ట్రస్థాయి హిందీ కార్యశాల

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ సంస్కత విశ్వావిద్యాలయంలో రాష్ట్ర స్థాయి హిందీ కార్యశాల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య జి ఎస్ కష్ణ మూర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష రాజ్య భాష అని, దేశాన్ని కలిపే భాష అని పేర్కొన్నారు. రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హిందీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా హిందీ పండితులు వేద్ ప్రకాష్ బోర్కర్, లతా మంగేష్ ల చేత హిందీ నుండి ఆంగ్లం లోకి అనువాదానికి ఉపయోగపడే ఈ టూల్స్ లను హాజరు అయిన సభ్యులందరికీ వివరించారు.

ముగిసిన జాతీయ నవజాత శిశు వారోత్సవాలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎస్ వి వైద్య కళాశాల, శ్రీ వేంకటేశ్వర రామ్ నారాయణ్ రుయా సర్వజన వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నవ జాత శిశు వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. పురిటి బిడ్డలలో జబ్బులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తల్లిపాల ప్రాముఖ్యత, చేతుల శుభ్రత, నవజాత శిశు సంరక్షణ పలు అంశాలు పై బాలింతలకు, బంధువులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. పురిటిబిడ్డల్లో వచ్చు జబ్బులపై డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ సత్యనారాయణ మూర్తి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖరన్ , రుయా సూపరిటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

స్థానికులకు దర్శనం హర్షనీయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనాన్ని స్థానికులకు టిటిడి పాలకమండలి పునరుద్ధరించడటం హర్షనీయమని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. గురువారం ఉదయం జనసేన పార్టీ ఆధ్వర్యంలో అలిపిరి పాదాలమండపం వద్ద నూట పదహారు కొబ్బరి కాయలు కొట్టి శ్రీవారికి కతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే స్థానికులకు నెలలో మొదటి మంగళవారం దర్శనాన్ని పునరుద్దరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ చేసిన కషి అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటేశ్వర రావు, ఆర్కాట్ కష్ణ ప్రసాద్, బాబ్జీ, అన్నా యువరాజ్ రెడ్డి పాల్గొన్నారు.





డ్వాక్రా సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి : పీడీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి)

గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలను ఆదర్శంగా తీర్చి దిద్దడానికి డిఆర్డిఏ అధికార యంత్రాంగం కషి చేయాలని తిరుపతి డిఆర్డిఏ పీడీ టిఎన్ శోభన్ బాబు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండల సమాఖ్యలో విజన్ బిల్డింగ్ పై నాలుగు రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. తరగతుల ముగింపు కార్యక్రమానికి పిడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయ సంఘ సభ్యులు స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కషి చేయాలన్నారు. ప్రతి సంఘ సభ్యులకు తమ జీవనోపాధి పెంపుకు ప్రత్యేక విజన్ ఉండాలని, అప్పుడే లక్ష్యాలను సాధించవచ్చున్నారు. ఏలూరు జిల్లా నుండి వచ్చిన ఏపీఎంలు సుబ్రమణ్యం, భానుమతి ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈ శిక్షణ తరగతులకు తిరుపతి ,చిత్తూరు, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు చెందిన డిపిఎంలు, ఏపీఎంలు, సీసీలు, చంద్రగిరి మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

చెంగాలమ్మ సేవలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట



సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ డా.వి.ఆర్ కె.కపా సాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. వారికి సహాయ కమీషనరు, కార్యనిర్వాహణాధికారి బి. ప్రసన్నలక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద పండితులచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆర్డీవో ఈ.కిరణ్మయి, సూళ్ళూరుపేట జడ్జి ఎస్.అనిల్ కుమార్, ఎమ్మార్వో ఎస్.వి.నరసింహ రావు, సీఐ. మురళి క్రిష్ణ, ఎస్సై.బ్రహ్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టాస్క్ ఫోర్స్‌ను సందర్శించిన పీసీసీఎఫ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అటవీ శాఖ పీసీసీఎఫ్ (విజిలెన్స్) డాక్టర్ ఎస్ ఎస్ శ్రీధర్ గురువారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్దగల టాస్క్ ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. పిసిసిఎఫ్ కు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ స్వాగతం పలికారు. అనంతరం టాస్క్ ఫోర్స్ పనితీరు గురించి పీసీసీఎఫ్ కు ఎస్పీ శ్రీనివాస్ వివరించారు. శేషాచలం అటవీ పరిధిలో ఉన్న కూంబింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, చెక్ పోస్టులు పనితీరు గురించి విశదీకరించారు. ఇంకా టాస్క్ ఫోర్స్ నిర్వహణ సామర్థ్యం పెంపుకు కావలసిన డ్రోన్ కెమెరాలపై చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి సీసీఎఫ్ సి.సెల్వం, డీఎఫ్ఓ పి.వివేక్, ఏసీఎఫ్ శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ సురేష్ కుమార్, ఎస్సై రఫీ, ఎఫ్ఆర్ఓలు మురళి, ప్రేమ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దాత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: క్యాన్సర్ బాధితురాలి కుటుంబ సభ్యులకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో దాత రమేష్ బేకరి అధినేత చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీ చైతన్య ప్రిన్సిపల్ శ్రీనివాసులు, మురళినాయుడు, రాము, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, కుమార్ నాయుడు, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియాపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: నిమోనియా వ్యాధితో జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిమోనియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ పిల్లల్లో నిమోనియా వ్యాధి లక్షణాలు గుర్తిస్తే వెంటనే చికిత్స అందించాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీలు చేపడుతున్న ఏవో భారతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఎరువుల దుకాణదారులు తప్పనిసరిగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి భారతి అన్నారు. గురువారం మండలంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. నాసిరకం విత్తనాలు, నిషేదిత రసాయన ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో షాపు యజమానులు మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండలంలోని పరమేశ్వర మంగళం వైద్య ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు రికార్డులు పరిశీలించారు. టీబీ కేసులకు సంబంధించిన వారి వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో వ్యాధి గుర్తించి వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో హేమభూషణ్ రెడ్డి, డాక్టర్ సాయిచరణ్, ఫిజియో థెరపిస్ట్ వెంకటరమణ, లెప్రసి మోడల్ అధికారి రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై సర్వే చేయాలి

- ఆచార్య కుసుమ



సర్వే కార్యక్రమంలో విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: వివిధ గ్రామాలలో ప్రజలకు వివిధ రకాల ఆదాయ వనరులు, ఖర్చు వివరాలపై సమగ్రంగా పూర్తి సర్వే చేయాలని సోషియాలజీ విభాగం ఆచార్యులు కుసుమ అన్నారు. తద్వారా వివరాలు సామాజిక శాస్త్ర విద్యార్థులకు సమాజం పట్ల పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ఎస్వీయూ విద్యార్థులకు క్షేత్ర పర్యటన రెండవ రోజు భాగంగా ఆమె దిశానిర్దేశం చేశారు. శేషాపురం, కందులవారిపల్లి గ్రామాలలో విద్యార్థుల చేత ఇంటింటా సర్వే చేయించి ఆరోగ్యం, ఆదాయం, పరిశుభ్రత వంటి అంశాలు గుర్తించిన వివరాలు సేకరించారు. గ్రామాలలోని ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ రమణయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బాబు ప్రవీణ్ కుమార్, డాక్టర్ ముకుంద నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు పంచాయతీ వీఆర్ఏ సిద్దయ్య(60) గురువారం మృతి చెందారు. సిద్దయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో తొట్టంబేడులోని ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. సిద్దయ్య మృతి పట్ల తొట్టంబేడు రెవెన్యూ అధికారులు విచారం వ్యక్తం చేశారు. తహశీల్దార్ మధుసూదన్ రావు సిద్దయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

రైతులకు అందుబాటులో యూరియా

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: రైతు సేవ కేంద్రాలలో యూరియా రైతులకు అందుబాటులో ఉన్నట్లు ఏర్పేడు మండలం ఎంపీఈవో అనిత తెలిపారు. పాత వీరాపురం కేంద్రంలో 200 బస్తాల యూరియా (కోరమండల్) రైతులకు అందుబాటులో ఉందని 45కిలోల బస్తా ధర రూ. 266.50లతో రైతులకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.



పీటీసీలో క్రీడోత్సవాలు





క్రీడలతోనే మానసికోల్లాసం

- పీటీసీ ప్రిన్సిపల్ సుబ్రమణ్యం
- ఘనంగా పోలీస్ వార్షిక క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): కళ్యాణి డ్యాం పోలీసు శిక్షణ కళాశాలలో పోలీస్ క్రీడ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పోలీసులకు పని ఒత్తిడితో పాటుగా మానసిక ఒత్తిడి కూడా అధికంగా ఉంటుందని పిటిసి ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం అన్నారు. అందువల్లే సంవత్సరంలో రెండు రోజులపాటు క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఆటల పోటీలు నిర్వహించి పోలీసులను మానసికంగా, శారీరకంగా, ఉత్సాహంగా ఉంచడానికి తోడ్పడుతుందని తెలిపారు. విధి నిర్వహణలో ఒడిదుడుకులను అధిగమించడానికి క్రీడలలోని గెలుపోవటములు ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది క్రీడలలో పాల్గొని తమ ఒత్తిడి నుంచి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని కోరారు. పిటిసిలో ఉన్న మహిళా సిబ్బందిని కూడా ప్రోత్సహిస్తూ వారు క్రీడలలో పాల్గొని జయ, అపజయాలను ఆస్వాదించాలని ప్రోత్సహించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాలీబాల్, షటిల్, షాట్ పుట్, జావలింగ్ త్రో వంటి ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు పిటిసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్య బలోపేతానికి కృషి

పాఠశాల విద్య జోన్ 4 రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ శామ్యూల్

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ప్రభుత్వ పాఠశాల విద్య బలోపేతం చేయడానికే ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ అన్నారు. ఈనెల 18 నుంచి మేడ్జ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న స్కూల్ లీడర్షిప్ శిక్షణా తరగతులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకత్వం ఉన్నప్పుడే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన 200మంది స్కూల్ హెడ్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణంలో 24గంటల వైద్యుల పర్యవేక్షణలో ట్రైనింగ్ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, రాష్ట్ర పరిశీలకులు అమ్మి నాయుడు, తిరుపతి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య, అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మధు, చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నంను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ తొట్టంబేడు మండల అధ్యక్షులు ఉన్నం వాసుదేవ నాయుడును మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శిం చారు. వాసుదేవ నాయుడి మొదటి భార్య ఇటీవల మృతి చెందారు. గురువారం పొయ్య గ్రామంలో ఆమె కర్మక్రియలకు హాజరైన మధుసూదన్ రెడ్డి నివాళులర్పించారు. వాసునాయుడుకు ధైర్యం చెప్పారు. మాజీ ట్రస్ట్ అంబోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా సుబ్బారావు నియామకం

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల నూతన వైస్ ప్రిన్సిపల్‌గా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్య సిహెచ్ డివి సుబ్బారావు నియమితులయ్యారు. ఆయన తన నియామక పత్రాన్ని వర్సిటీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా నియామకం కావడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

నేడు ఎస్వీయూలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలోని ఆరోగ్య కేంద్రం జూనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య, డిఎస్డబ్ల్యుసిఎ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం "మహిళల హక్కులు ఆరోగ్య సమస్యలపై" మహిళా విద్యార్థిని, పరిశోధకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మజ, ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ మంజుల, డిస్టిక్ కార్పొరేటు ఆఫీసర్ లక్ష్మిలు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్లు



అవగాహన కార్యక్రమంలో అధికారులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలి, మరుగుదొడ్లు ఉపయోగంతోనే ఆరోగ్యమని ఎంపిడిఓ గిడ్డయ్య అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం చిన్నగొట్టిగల్లు ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల వినియోగం ఆవశ్యకథపై విద్యార్థుల్లో అవగాహణ కల్పించారు. అవగాహనతో మరుగుదొడ్లనే ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈవోఆర్‌డీ సోమశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్రమణ్యం, ఎంఈవో గోపి, ఎంసివో గిరి బాబు, ఉపాధ్యాయులు, విద్యర్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తడ: మండలంలోని బోడి లింగాలపాడులో ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతు మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించవలసిన చిరు సహాయాన్ని ఈ ప్రభుత్వం అందించలేదన్నారు. అలాగే ఇసుక మేటలను కూడా తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆర్మగం, వైస్ ఎంపీపీ రమేష్, ఆర్‌కె సుందర్ రెడ్డి, తిరుమల రెడ్డి, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి పర్యటనకు విచ్చేసిన కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి రక్ష నిఖిల్ కట్చేని తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో ఎన్ఎస్ఎస్ సెల్యూట్‌తో ఎస్వీయూ జూరిడిక్షన్ ఎన్ఎస్ఎస్ బ్యూరో అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు ఆచార్య దామోదరం, డాక్టర్ పాకనాటి హరికృష్ణ దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి ఈ సందర్భంగా వలంటీర్లను, అధికారులను ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై ఆరా తీసి, వివరాలు కనుక్కొని, కార్యక్రమాలపై అభినందించారు. ఆ తర్వాత వలంటీర్లతో మంత్రి ప్రత్యేకంగా ఫోటో దిగారు. యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ రక్షా నిఖిల్, తిరుపతి విచ్చేసిన సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ బ్యూరో ప్రోగ్రాం అధికారిని డాక్టర్ నీరజ, వలంటీర్‌లు సాదర స్వాగతం పలికారు.

విత్తన, ఎరువుల నాణ్యతపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లికార్జునయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో శ్రీకాళహస్తి, చంద్రగిరి, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, సత్యవేడు, నగరి నియోజకవర్గాలకు చెందిన వ్యవసాయ అధికారులకు విత్తన, ఎరువుల నాణ్యతపై రెండు రోజుల శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల నాణ్యతను ఎలా పరీక్షించాలో వివరించారు. వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ మల్లికార్జునయ్య, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎంఈవో



త్రోబాల్ పోటీలకు ఎంపికైన జట్టుతో పీడీలు

- క్రీడలతోనే మానసిక ఉల్లాసం
- ఎంఈవో జయ వేలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని, మండల విద్యాశాఖ అధికారి-2 జయవేలు అన్నారు. గురువారం మండలంలోని నెత్త కుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 14 ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆయన క్రీడాకారులను స్థానిక పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిజమ్మ, హెచ్‌ఎం లలితకుమారి, పీడీ సుబ్రహ్మణ్య రెడ్డి, తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబుతో పాటు కలిసి పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ క్రీడల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు పాఠశాలల నుంచి 150 మందికి క్రీడాకారులు పాల్గొనగా రాష్ట్రస్థాయి పోటీలకు 12 మంది బాలురులు, 12 మంది బాలికలు ఎంపికైనట్లు హెచ్‌ఎం తులసి కుమారి తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత విద్యను అభ్యసించడంలో, ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో పీడీలు చిన్నప్ప, కరుణానిధి, లోకేష్, భవాని, భార్గవి, గోపీనాథ్, దేవరాజులు, సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపిక

బాలికల విభాగంలో భానుశ్రీ (కందూరు, సోమల మండలం) సుకన్య (నగరి), పద్మశ్రీ (సదుమూరు ,కుప్పం), వర్షన (పిసిఆర్ చిత్తూర్), వాణి (పంగూరు, ఏర్పేడు మండలం), చాందిని (పంగూరు), అనన్య (సోమల మండలం), దీశాలిని (నెత్త కుప్పం), అక్షర (సోమల మండలం), వసంతిక (కందూరు), రాణి (పెద్ద కనపర్తి, తొట్టంబేడు మండలం), గౌరీ ప్రియ (పూతలపట్టు). బాలుర విభాగంలో వసంతు (ఏకాంబర కుప్పం), గురు లోకేష్ (పెద్ద కనపర్తి), మహమ్మద్ షాహిద్ (చీనేపల్లి, ఉర్దూ స్కూల్), చరణ్ తేజ్ (సోమల), రోహిత్ (మొగరాల), రేవంత్ (కందూరు), భువనేష్ (సదుమూరు), తులసిరాం (పంగూరు), జహీర్ (రొంపిచర్ల), కుశ్వంత్ (నేత కుప్పం), ప్రణీత్ (పిసిఆర్ చిత్తూర్), నితీష్ (పూతలపట్టు), ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్లు తెలిపారు.

కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విద్యార్థులను మోసం చేసిన కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పుత్తూరు ఎస్ఐ ఓబయ్యకు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి మహేష్ దళిత గిరిజన సంఘం నందయ్య మాట్లాడుతూ పట్టణంలో బాసర డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అందినకాడికి అభ్యర్థుల నుంచి వసూళ్లు చేసి ఆపై కోచింగ్ సెంటర్‌ను మూసివేశారని మండిపడ్డారు. కోచింగ్ సెంటర్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

- తహశీల్దార్‌కు వినతి



తహశీల్దార్‌కి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఇంటి పట్టాలు మంజూరు చేయాలని రూరల్ మండలం తడుకు పంచాయతీ వేంకటేశ్వర దాసరి ఇండ్లు గ్రామస్తులు గురువారం తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య మాట్లాడుతూ తడుకు గ్రామంలో సర్వే నంబర్ 6/2లో గత పది ఏళ్లుగా గుట్ట పోరంబోకు భూమిలో చెట్టు పుట్ట కొట్టుకొని చదును చేసుకొని వేంకటేశ్వర దాసరి ఇండ్లలో 23కుటుంబాలు జీవిస్తున్నారన్నారు. 2019 నుంచి అనేక సార్లు అధికారులకు అర్జీలు ఇచ్చానా ఫలితం లేకపోయిందని, ప్రస్తుత తహశీల్దార్ చొరవ తీసుకొని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మురళి, వెంకటస్వామి, వెంకట రాజన్న, మురగమ్మ, యశోద, శైలజ, చందు, కావేరి, గంగ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి అన్నారు. గురువారం పుత్తూరు డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం, ఇకోక్లబ్‌ల సంయుక్త సారథ్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యాపకులు, విద్యార్థులు రోజ్ వుడ్ మొదలైన చెట్లను నాటారు. కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, పద్మావతి, అధ్యాపకులు డాక్టర్ సుజన, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి: భాస్కరరావు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ భాస్కరరావు అన్నారు. పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీ గేట్ గేమ్స్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో సుమారు వంద కళాశాలలు ఉండగా అతి తక్కువ సంఖ్యలో ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు పాల్గొనడం బాధాకరంగా ఉందని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న క్రీడ ఆసక్తిని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్టర్ సునీత, కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, అధ్యాపకులు నారాయణ రాజు, వెంకట్రాయలు, వెంకటేశ్వర్లు, శ్రీధర్మ శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయాలు హర్షనీయం: జగన్నాథం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి ధర్మకర్తల మండలి తిరుపతి స్థానికులకు నెలలో మొదటి మంగళవారం దర్శనం కల్పించాలని నిర్ణయించడం పట్ల బీసీ సంఘాల తరపున టీటీడీ బోర్డుకు, సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నామని గాండ్ల సాధికార సమితి నాయకులు జగన్నాథం అన్నారు. గురువారం తిరుపతి ఫ్రెండ్స్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవారి దర్శనానికి వివిధ రవాణా సౌకర్యాల ద్వారా లక్షల మంది భక్తులు వస్తుంటారన్నారు. వీరందరికీ టీటీడీ తీసుకున్న నిర్ణయాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రామారావు, ధ్యానశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాజంపేట సమీపంలోని ఎస్ఆర్ పాలెం సెక్షన్‌లో 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆర్ఎస్ఐ పి.నరేష్ బందం, ఎఫ్‌బీఓ కిరణ్ కుమార్‌తో కలసి రాజంపేట పరిధిలోని ఎస్ఆర్ పాలెం సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారని తెలిపారు. రోళ్లమడుగు బీట్ వద్ద ఎర్ర దుంగలను మోసుకుని వస్తున్న వారిని చుట్టుముట్టగా వారిలో కొందరు పారిపోగా ఇద్దరు పట్టుబడ్డారన్నారు. వీరు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించామన్నారు. సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

జగన్‌వి నీచ రాజకీయాలు : మమత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి అక్కస్సుతో నీచ రాజకీయాలు చేస్తున్నారని ముత్యాలరెడ్డి పల్లి మాజీ సర్పంచి మమత అన్నారు. గురువారం తిరుపతి నగర పరిధిలోని ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని, ప్రజలు తిరస్కరించినా అతనిలో మార్పు రాలేదన్నారు. సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులపై లేనిపోని అవాస్తవాలను మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న కారు

- సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కాపుగునేరి పంచాయతీ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే కే రాజ్ కుమార్ (29)రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు.. కాపుగున్నేరిలోని సచివాలయంలో విధులు ముగించుకొని సాయంత్రం 6:30 సమయంలో ఇంటికి వెళ్లేందుకు కాపుగున్నేరి హైవే దాటే క్రమంలో వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో రాజ్‌కుమార్ తీవ్ర గాయాలకు గురయ్యాడు. సహచర ఉద్యోగులు స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అంతలోనే రాజ్‌కుమార్ ప్రాణాలు విడిచారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కారుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



డ్రోన్ శిక్షణ, తయారీపై ఎస్వీయూ అవగాహన ఒప్పందం



ప్రజాశక్తి-క్యాంపస్: సీఎం చంద్రబాబు ఏపీని డ్రోన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చాలనే ఉద్దేశ్యాన్ని ఎస్వీయూ ఒడిసిపట్టింది. డ్రోన్, అంతరిక్ష సాంకేతికతలలో అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో ఎస్వీయు ఇన్చార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, రూసా ప్రతినిధులు వివిధ సంస్థల "డ్రోన్స్, స్పేస్ టెక్నాలజీస్ కన్సార్టియం" ప్రతినిధులు అధికారికంగా సంతకం చేశారు. ఈ భాగస్వామ్యంలో ఎస్వియూ, ఆర్‌ఎఫ్‌ఎల్‌వై ఇన్నోవేషన్స్ ప్రవేట్ సంస్థ, ఎర్త్‌నౌ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ మిస్టర్ రితేష్ కుమార్ సింగ్, ఏరో హబ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సిఇవో బరహలికర్ నర్సింగ్ రావు, ఔరంటియస్ డైరెక్టర్ ప్రణవ్‌కుమార్ చిట్టే, టెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీనివాస్ ప్రసాద్ కుందూరు ఆయా సంస్థలు సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు మాట్లాడుతూ పరిశ్రమ-విద్యాపరమైన పరిశోధన, ఆవిష్కరణలు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కోసం ఒక బలమైన పరివర్తనాత్మక సహకారాన్ని పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా ఈ అవగాహనా ఒప్పందం నిలుస్తుందన్నారు. దీనిని విద్యార్థులు, పరిశోధకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రూసా కోఆర్డినేటర్లు ఆచార్య రమశ్రీ, డాక్టర్ ఉషారెడ్డి, రూసా సీఈవో వంశీకృష్ణ రాయలు, ఎస్వీయూ ఇంజనీర్ తాండవ కృష్ణ పాల్గొన్నారు.